## యాదాద్రి పవర్ ప్లాంట్‌లో
# అగ్ని ప్రమాదం

- మొదటి యూనిట్ బాయిలర్ వద్ద కాలిపోయిన కేబుళ్లు
- గ్యాస్కెట్ ఒత్తిడికి గురై ఆయిల్ లీక్ కావడంతో ప్రమాదం
- పర్యవేక్షణ లోపమే ఘటనకు కారణమని అనుమానాలు



అగ్నిప్రమాదంలో కాలిపోయిన పైపులు

హైదరాబాద్ ఏప్రిల్ 28: నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని యాదాద్రి పవర్‌ప్లాంట్ (వైటీపీఎస్)లో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 800 మెగావాట్ల మొదటి యూనిట్‌లోని బాయిలర్ వద్ద గ్యాస్కెట్ ఒత్తిడికి గురై ఆయిల్ లీకేజీ కావడంతో మంటలు అంటుకున్నాయి. దీంతో ప్లాంట్‌లో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. బాయిలర్ వద్ద సుమారు 30 మీటర్ల పరిధిలోని కమ్యూనికేషన్ కేబుళ్లు, పైపులు తదితర సామగ్రి కాలిపోయాయి. ప్లాంట్‌లోని అగ్నిమాపక దళ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. మొదటి యూనిట్ ఇప్పటికే పనులు పూర్తి చేసుకొని ట్రయల్ రన్‌కు సిద్ధంగా ఉన్నది. మూడు రోజులపాటు నిరంతరాయంగా 800 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు సీవోడీ పూర్తికావాల్సి ఉంది. ఈ క్రమంలోనే ప్రమాదం చోటు చేసుకున్నది. ఆదివారం కావడం, ప్రమాదం జరిగిన ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ప్లాంటును పరిశీలించారు. ప్రమాదానికి కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### పర్యవేక్షణ లోపమే కారణమా?

యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని మొదటి యూనిట్ బాయిలర్ వద్ద జరిగిన అగ్ని ప్రమాదానికి పర్యవేక్షణ లోపమే కారణమన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇంధనం లీకేజీతోనే ప్రమాదం జరిగిందని, స్వల్ప నష్టం జరిగిందని, మొదటి ప్లాంట్ నిర్మాణపు పనులు పూర్తి కాలేదని, ఇంకా బీహెచ్ఈఎల్ ఆధీనంలో పనులు కొనసాగుతున్నాయని టీజీ జెన్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రమాద విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సోమవారం సచివాలయంలో జెన్‌కో సీఎండీ సందీప్‌కుమార్ సుల్తానియా, బీహెచ్ఈఎల్ సీఎండీ సదాశివమూర్తిలతోపాటు వైటీపీఎస్ ఇంజినీర్లతో సమీక్షించారు. వారం రోజుల్లో మరమ్మతులు చేపడతామని బీహెచ్ఈఎల్ అధికారులు తెలిపారు.

# చిన్నారి ప్రాణం తీసిన పల్లిగింజ
## గొంతులో ఇరుక్కుని ఊపిరాడక మృతి

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 28: పల్లిగింజ గొంతులో ఇరుక్కుని ఓ చిన్నారి ఊపిరి విడిచిన ఘటన రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో చోటుచేసుకున్నది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. లష్కర్‌గూడకు చెందిన బండారి మహేశ్వరి– శ్యామ్‌సుందర్ దంపతుల ఒక్కగానొక్క కుమార్తె తన్విక(4).. ఆదివారం ఇంట్లో వేయించిన పల్లీలు తిన్నది. ఓ పల్లిగింజ గొంతులో ఇరుక్కుని ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో తల్లిదండ్రులకు తెలిపింది. వెంటనే అప్రమత్తమైన తల్లిదండ్రులు.. నగరంలోని నీలోఫర్ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు.. గొంతులో పల్లి ఇరుక్కుపోయినట్టు నిర్ధారించారు. సోమవారం చికిత్స పొందుతుండగానే.. పరిస్థితి విషమించి తన్విక ప్రాణం విడిచింది. చిన్నారి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

# ప్రై‘వేటు’కు సిద్ధంగా వైటీపీఎస్!

- ప్లాంట్ నిర్వహణ లోపం వెనక కుట్ర
- ఉద్దేశపూర్వకంగానే ఓఅండ్ఎం స్టాఫ్ ఇంజినీర్లను కేటాయించని జెన్‌కో
- ఆరు నెలలుగా వేధిస్తున్న సిబ్బంది కొరత
- సీఈ లేఖ రాసినా స్పందన శూన్యం
- ప్లాంట్‌ను ప్రైవేటుకు అప్పగించే ప్లాన్
- జెన్‌కో ఇంజినీర్ల అనుమానం



హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఓ ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయా? ఈ ప్లాంట్ ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ (ఓఅండ్ఎం)ను సదరు సంస్థకు అప్పగించేందుకు భారీ కుట్ర చేశారా? అంటే.. టీజీ జెన్‌కో ఇంజినీర్లు అవుననే అంటున్నారు. కుట్రలో భాగంగానే ఈ ప్లాంట్‌కు ఇంజినీర్లు, సిబ్బందిని కేటాయించలేదని చెప్తున్నారు. నిర్వహణ లోపాలు తలెత్తినా ప్లాంట్‌ను పట్టించుకోలేదని అంటున్నారు. దీని వెనుక భారీ కుట్ర దాగి ఉందని, పెద్ద ప్రణాళిక ఉందని అనుమానిస్తున్నారు. నల్లగొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంట్‌లో సోమవారం అగ్నిప్రమాదం జరిగింది. అర్ధరాత్రిపూట యూనిట్–1లో ఆయిల్ లీకై ఉష్ణోగ్రతలు పెరిగి అగ్ని ప్రమాదం సంభవించింది. రాత్రి పూట కావడంతో ప్రాణనష్టం తప్పింది. కానీ ఆస్తినష్టం మాత్రం భారీగానే జరిగింది. మొత్తంగా 600 మెగావాట్ల విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. ప్లాంట్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది, ఇంజినీర్లు లేకపోవడంతోనే ప్రమాదం జరిగినట్టు జెన్‌కో ఇంజినీర్లు తేల్చారు. ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ సిబ్బంది కొరతతోనే ప్రమాదం జరిగిందని గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారులు నివేదిక కోరారు. సిబ్బందిని కేటాయించాలని తాము మొత్తుకున్నా పట్టించుకోలేదని, దీంతోనే ప్లాంట్‌లో అగ్నిప్రమాదం జరిగినట్టు ప్లాంట్ అధికారులు నివేదికను సిద్ధం చేసినట్టు సమాచారం. యూనిట్ పునరుద్ధరణకు నెలరోజులు పట్టే అవకాశముంది. అప్పటి వరకు విద్యుదుత్పత్తి నిలిచిపోయినట్లే లెక్క.

### తెరవెనుక .. పెద్ద ప్లానే..

పవర్ ప్లాంట్‌లోని రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి జరుగుతున్నది. ఒక యూనిట్ మూడు షిఫ్టుల్లో నడవాలంటే దాదాపు 200 మంది ఇంజినీర్లు, మరో 300 మంది ఓఅండ్ఎం సిబ్బంది అవసరం. దాదాపు అన్ని ప్లాంట్లలోనూ సరిపోయే ఇంజినీర్లు, ఓఅండ్ఎం సిబ్బంది ఉన్నారు. జెన్‌కో ద్వారా నడుస్తున్న అన్ని ప్లాంట్లకు ఇంజినీర్లు, సిబ్బందిని కేటాయించి, ఒక్క వైటీపీఎస్‌కు మాత్రం పూర్తి స్థాయి సిబ్బందిని ఎందుకు కేటాయించలేదన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. వారం రోజుల క్రితం 150కి పైగా సిబ్బందిని కేటాయించారు. వీరు మూసివేసిన ప్లాంట్లకు చెందిన వారే. కానీ వైటీపీఎస్ ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో ఇంజినీర్లు, సిబ్బందిని కేటాయించలేదు. ఇంజినీర్లు, సిబ్బందిని కేటాయించకపోవడం వెనుక బిగ్ స్కెచ్ ఉన్నట్టు ఇంజినీర్లు అనుమానిస్తున్నారు. వైటీపీఎస్‌కు అవసరమైన సిబ్బందిని కేటాయించకుంటే సమస్యలు తలెత్తి విద్యుదుత్పత్తికి ఆటంకం కలిగి ప్రమాదం సంభవిస్తుందని, అప్పుడు అనుకూలంగా విచారణ చేయించి జెన్‌కో విఫలమైందని నిరూపించవచ్చన్నది ప్రభుత్వ యోచన. అప్పుడు జెన్‌కోను తప్పించి ప్రైవేటు సంస్థకు వైటీపీఎస్‌ను అప్పగించవచ్చని ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. అలాగే, ఈ ప్లాంట్‌ను నిర్మించిన బీఆర్ఎస్ సర్కారు, కేసీఆర్‌పై నిందలేసి దోషిగా చూపించాలనేది సర్కారు పెద్దల ప్లాన్‌గా తెలిసింది. ఆ కారణంగానే ఆరు నెలలుగా యాదాద్రి ప్లాంట్‌కు సిబ్బందిని, ఇంజినీర్లను కేటాయించలేదని సాక్షాత్తు జెన్‌కో ఇంజినీర్లే అంటున్నారు.

### ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టేందుకేనా?

యాదాద్రి పవర్‌ప్లాంట్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌ను (ఓఅండ్ఎం)ను ఓ ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టేందుకు ప్రయత్నాలు జరిగాయి. సర్కారు పెద్దల స్థాయిలో దాదాపు నిర్ణయం కూడా జరిగిపోయింది. ఈ తంతంగం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయట. కమిషన్లు కూడా ఖరారయ్యాయట. జెన్‌కో ద్వారా అయితే ఓఅండ్ఎం వ్యయం అధికమని, ప్రైవేట్ కంపెనీ అయితే తక్కువవుతుందని కారణాలు చూపారట. అయితే దీనిని జెన్‌కో ఇంజినీర్లు వ్యతిరేకించారు. ప్రైవేట్‌కు అప్పగిస్తే ఊరుకోబోమని, జెన్‌కో ద్వారానే చేపట్టాలని ఉద్యోగ సంఘాలు కూడా డిమాండ్ చేశాయి. దీంతో సదరు కంపెనీకి అప్పగించే ప్రయత్నాలకు తాత్కాలికంగా బ్రేకులు పడ్డాయి. అప్పటి నుంచే అసలు కథ మొదలైంది. తెర ముందు ప్రయత్నాలు మాని, తెరవెనుక అసలు కథ మొదలుపెట్టారు. యాదాద్రి ఓఅండ్ఎం నుంచి జెన్‌కోను తప్పించి, ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టేందుకు అప్పటి నుంచి ప్రయత్నాలు మొదలెట్టారు.

### పోస్టింగ్స్ ఇవ్వకుండా తాత్సారం

టీజీ జెన్‌కోలో కొంతకాలం క్రితం 203 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకు అసిస్టెంట్ డివిజినల్ ఇంజినీర్లుగా (ఏడీఈ) పదోన్నతులు కల్పించారు. వీరికి ఎక్కడా పోస్టింగ్స్ ఇవ్వలేదు. ప్రైవేట్ కంపెనీకి ఓఅండ్ఎం పనులు కట్టబెట్టడంలో భాగంగానే పదోన్నతులు పొందిన వారికి పోస్టింగ్స్ ఇవ్వలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపు ఆరు నెలలుగా పూర్తిస్థాయి సిబ్బందిని కేటాయించలేదు. ప్లాంట్‌లో ఇంజినీర్లు, సిబ్బంది కొరత ఉన్నదని, ప్లాంట్‌ను ఎలా నడపాలని వైటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ జెన్‌కో సీఎండీకి లేఖ రాశారు. తగినంత సిబ్బంది, ఇంజినీర్లను కేటాయించాలని ఆ లేఖలో కోరారు. అయినా స్పందించిన దాఖలాల్లేవు. సిబ్బందిని కేటాయించలేదు. పదిహేను రోజుల క్రితం కొంతమంది సిబ్బందిని, అదీ.. ఒక్క యూనిట్‌కే కేటాయించి చేతులు దులుపుకొన్నారు.

# ఉత్తమ్, కోమటిరెడ్డిది సీఎం స్థాయి
### ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ) : 'నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కేవలం మంత్రులే కాదు.. ముఖ్యమంత్రి స్థాయి ఉన్నవాళ్లు' అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో అదనపు భవనాల శంకుస్థాపనలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డితోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. నిన్న మొన్న రాజకీయాల్లోకి వచ్చిన వారు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గురించి ఏదేదో మాట్లాడటం తగదని అన్నారు. జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలంతా అసాధ్యులని పేర్కొన్నారు.

### ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం: ఉత్తమ్

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని ముందుకు తీసుకుపోతామని తెలిపారు. ప్రస్తుత పరిస్థితిని ఒక ఆటంకంగా మాత్రమే పరిగణిస్తున్నట్టు చెప్తూ, సొరంగ మార్గాన్ని పూర్తి చేస్తామన్న విశ్వాసం ఉన్నదని పేర్కొన్నారు.

# నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

- రూ.13 లక్షల బంగారు, వెండి ఆభరణాలు బాధితుడికి అందజేత

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : ఓ ప్రయాణికుడు బస్సులో మర్చిపోయిన విలువైన వస్తువులు, నగదును బాధితుడికి అందజేసి నిజాయితీ చాటుకున్నాడు ఆర్టీసీ కండక్టర్. అచ్చంపేట డిపోకు చెందిన కండక్టర్ వెంకటేశ్వర్లు.. ఈ నెల 26న అచ్చంపేట–హైదరాబాద్ రూట్‌లో విధులు నిర్వహించాడు. ఈక్రమంలో ఓ ప్రయాణికుడు బస్సులో మర్చిపోయిన బ్యాగ్‌ను గుర్తించి దానిని తెరిచి చూడగా అందులో 14 తులాల బంగారు, 10 తులాల వెండి ఆభరణాలతోపాటు నగదు, సర్టిఫికెట్లు ఉన్నాయి. ఈ విషయాన్ని అచ్చంపేట డీఎం మురళీ దుర్గాప్రసాద్‌కు తెలియజేశాడు. దీంతో ఆయన ఎంజీబీఎస్‌లోని మేనేజర్ కార్యాలయంలో అప్పగించాలని సూచించాడు. ఇంతలోనే అనిల్‌కుమార్ అనే ప్రయాణికుడు డీఎంకు ఫోన్ చేసి తన బ్యాగ్‌ను బస్సులో మర్చిపోయినట్టు దీంతో ఆర్టీసీ అధికారులు వివరాలు తెలుసుకొని బ్యాగ్‌ను అనిల్‌కు అప్పగించారు. కండక్టర్ నిజాయితీని గుర్తించిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోమవారం బస్‌భవన్‌లో వెంకటేశ్వర్లును సన్మానించారు.

# కేటీఆర్‌పై మరో కేసు కొట్టివేత

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఆరోపణలు చేశారంటూ బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై నమోదైన కేసును హైకోర్టు కొట్టివేసింది. సీఎం రేవంత్‌రెడ్డి బిల్డర్లు, కాంట్రాక్టర్ల నుంచి వసూలు చేసిన రూ.2500 కోట్లను ఢిల్లీకి పంపారంటూ గత ఏడాది మార్చి 27న కేటీఆర్ చేసిన ఆరోపణలు తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయంటూ కాంగ్రెస్‌కు చెందిన బత్తిన శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. దీనిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో గత ఏడాది మార్చి 29న నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ విచారణ జరిపారు. మార్చి 27న కేటీఆర్ ఆరోపణలు చేస్తే మూడు రోజులు ఆలస్యంగా ఫిర్యాదు చేశారని హైకోర్టు తప్పుపట్టింది. ఆలస్యానికి కారణాలు కూడా పేర్కొనలేదని ఆక్షేపించింది. ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని తెలిపి కేసును కొట్టివేస్తున్నట్టు ప్రకటించింది.

## 'భూదాన్' వ్యవహారంలో
# ఈడీ సోదాలు

- పలు కీలక పత్రాలు, ఆధారాలు స్వాధీనం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరోసారి ఈడీ సోదాలు కలకలం సృష్టించాయి. భూదాన్ భూముల వ్యవహారంలో అధికారులు ఈ సోదాలు చేపట్టారు. హైదరాబాద్ పాతబస్తీలోని పలువురి ఇండ్లలో సోమవారం ఉదయం నుంచే సోదాలు ప్రారంభమయ్యాయి. మునావర్ ఖాన్, ఖదీర్ ఉన్నీసా, సర్ఫాన్, షకూర్ భూదాన్ భూములను ఆక్రమించడంతోపాటు లే–అవుట్ వేసి వాటిని అమ్మినట్టు తెలియడంతో ఈడీ తనిఖీలు చేపట్టింది. సోదాల్లో అధికారులు పలు కీలక పత్రాలు, ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. దాదాపు 50 ఎకరాల భూదాన్ భూములు అన్యాక్రాంతమవడంపై ఇప్పటికే విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. ఆ విచారణ నివేదిక ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగా గతంలో ఐఏఎస్ అమోయ్ కుమార్‌ను ఈడీ అధికారులు విచారించిన విషయం తెలిసిందే.






Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.